క్లుప్తంగా

నేడు కావడి సేవలు

కర్నూలు కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య స్వామి జన్మ నక్షత్రం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు, కావడి సేవలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు శనైశ్చర జయంతి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ అమావాస్య తిథిని పురస్కరించుకొని శనీశ్వరుడి జయంతిని ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7 గంటలకు తైలాభిషేకం, శనైశ్చర హోమం, కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి సింధూరార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కవ్వింపు చర్యలకు దిగితే కఠిన చర్యలు



కోడుమూరులో ప్రజలను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ బాలనరసింహులు

కోడుమూరు రూరల్: ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఎవరైనా కవ్వింపు చర్యలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కోడుమూరు ఎస్‌ఐ బాల నరసింహులు హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. మైక్ ద్వారా సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన దృష్ట్యా గెలిచిన వారు బాణాసంచా పేలుళ్లు, విజయోత్సవ ర్యాలీలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా తిరగరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సంయమనం పాటించాలి



పోలకల్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్‌ఐ తిమ్మారెడ్డి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మండలంలోని పల్లెల్లో పర్యటించారు. పోలకల్, ముడుమాల, కొండాపురం, ఇనగండ్ల, గుండ్రేవులు, సంగాల, పలుకుదొడ్డి గ్రామాల్లో బందోబస్త్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ.. అందరూ సంయమనం పాటించాలని సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. బందోబస్త్‌లో ఏఎస్‌ఐ నాగయ్య పాల్గొన్నారు.

కోడుమూరు ఎమ్మెల్యేగా బొగ్గుల దస్తగిరి

కోడుమూరు రూరల్: కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గెలుపొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఆదిమూలపు సతీష్, తెలుగుదేశం పార్టీ నుంచి బొగ్గుల దస్తగిరి, కాంగ్రెస్ నుంచి పరిగెల మురళీకృష్ణ పోటీపడ్డారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే పోటీ నెలకొంది. మంగళవారం వెలువడిన 20 రౌండ్ల ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి 21,583 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బొగ్గుల దస్తగిరికి 1,01,703 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సతీష్‌కు 80,120 ఓట్లు పోలయ్యాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి మురళీకృష్ణకు 9,835 ఓట్లు వచ్చాయి. కాగా కోడుమూరు నియోజకవర్గంలో మొత్తం 2,46,632 ఓట్లు ఉండగా 1,95,180 ఓట్లు పోలయ్యాయి.

వాహనాల దారి మళ్లింపుతో ఇబ్బందులు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల వద్ద కౌంటింగ్ సందర్భంగా అధికారులు హైవేపై వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. మంగళవారం తెల్లవారుజామున నుంచి కౌంటింగ్ ముగిసే వారకు హైవేపై బలపనూరు మెట్ట నుంచి పాణ్యం డొంగు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలను డైవర్షన్ చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల డైవర్షన్ కోసం హైవే అధికారులు ప్రత్యేక మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మెలకువలు పాటిస్తే తెల్ల బంగారమే!

- పత్తి సాగులో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు
- విత్తన మోతాదు, విత్తనశుద్ధి, సరిహద్దు పంటలు, అంతర పంటలు అవసరం
- బార్డర్ క్రాప్స్‌గా జొన్న, మొక్కజొన్న, సజ్జలు వేసుకోవాలి
- అంతర పంటలుగా పెసర, మినుము, సోయాచిక్కుడు ఉత్తమం
- అదనపు ఆదాయం పొందొచ్చు
- కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): సస్యరక్షణ, మెళకువలతో పత్తి సాగు చేస్తే అద్భుతంగా రాణించవచ్చు. పత్తిలో ప్రధాన సమస్య గులాబిరంగు పురుగు. రెండు, మూడేళ్లుగా ఆకుమడత వైరస్, టుబాకో స్ట్రీక్ వైరస్ తెగుళ్ల వ్యాపించి పత్తి రైతును నష్టపరుస్తున్నాయి. ఈ పురుగుల బెడద లేకుండా పత్తిలో రాణించడానికి ఉన్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుంటే అధిక దిగుబడులకు అవకాశం ఉంది. రైతులు ప్రధానంగా విత్తన మొతాదు, విత్తనశుద్ధి, సరిహద్దు పంటలు, అంతర పంటలు, అధిక సాంద్రతలో సాగు ఇవన్నీ పత్తిలో విశేషంగా రాణించేందుకు తోడ్పడతాయి. వీటిని సక్రమంగా చేపడితే పత్తి సాగులో అధిక దిగుబడులతో పాటు అదాయం పొందవచ్చని వ్యవసాయ శాఖ కర్నూలు డివిజన్ సహాయ సంచాలకులు ఎన్.సాలురెడ్డి తెలిపారు. అధిక సాంద్రత పద్ధతిని ప్రోత్సహిస్తున్నామని.. ఈ పద్ధతిలో పత్తి పంట 125 రోజులకే పూర్తి అవుతుందని, గులాబిరంగు పురుగు, తెగుళ్ల బెడదను తగ్గించుకోవచ్చని సూచించారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడం, ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి విత్తనాలు నాటుతున్న నేపథ్యంలో రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

➡ జిల్లాలో ప్రధాన పంట పత్తి. ఈ పంటను నల్లరేగడి నేలల్లో ఒక రోజు లేదా రెండు మూడు రోజుల్లో 75 మి.మీ నుంచి 89 మి.మీ వర్షపాతం నమోదైనప్పుడు మాత్రమే విత్తనాలు విత్తుకోవాలి. ఎర్ర నేలలు, నల్ల తేలికపాటి నెలల్లో కనీసం 50 మి.మీ వర్షపాతం నమోదైతే మాత్రమే విత్తుకోవాలి.

➡ రసం పీల్చే పురుగులు, గులాబి రంగు పురుగులు, తెగుళ్ల పత్తికి ప్రధాన సమస్యలు. ముఖ్యంగా రసం పీల్చే పురుగుల బెడదను 15 నుంచి 20 రోజుల పాటు లేకుండా చేసుకోవడానికి విత్తన శుద్ధి అత్యవసరం. విత్తన కంపెనీలు విత్తనశుద్ధి చేసే ప్యాకింగ్ చేసి ఉంటాయి. అయితే విత్తనశుద్ధి మందు రాలిపోయి ఉంటుంది. అందువల్ల పనిచేయదు. విత్తుకోవడానికి ముందు కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ లేదా థయోమిథాక్సమ్ లేదా కార్బోసల్ఫాన్ మందు కిలో విత్తనానికి 5 గ్రాములతో విత్తనశుద్ధి చేసుకోవాలి. మందుతో పాటు 5 ఎంఎల్ జిగురు వంటి పదార్థం వినియోగిస్తే మందు విత్తనాలకు బాగా అతుకుతుంది. కలుపు సమస్యను తగ్గించుకోవడానికి పత్తి విత్తనాలు విత్తిన 48 గంటల్లో పిండిమిథిలిన్ మందును ఎకరాకు 1.40 లీటర్లు వినియోగించాలి.

➡ పత్తిలో అధిక ఉత్పత్తి సాధించడానికి అధిక సాంద్రత పద్ధతిని ప్రోత్సహిస్తున్నాం. ఇందు వల్ల పొలంలో మొక్కల సంఖ్య పెరుగుతుంది. దిగుబడి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. అధిక సాంద్రత పద్ధతికి అన్ని బీటీ విత్తనాలు పనికిరావు. ఎంపిక చేసిన పత్తి విత్తనాలే వినియోగించాల్సి ఉంది. స్వల్పకాలిక రకాలు ఆద్య, ప్లాటినం, సిఫ్ట్‌తో పాటు మరో రెండు రకాలు ఉన్నాయి. వీటిని మాత్రమే వినియోగించాలి. అధిక సాంద్రత పద్ధతికి నల్ల రేగడి నేలల్లో ఎకరాకు 4 ప్యాకెట్లు, ఎర్ర నేలలు, తేలికపాటి నేలల్లో 4-6 ప్యాకెట్లు వినియోగించాలి. ఈ పద్ధతిలో సాలుకు, సాలుకు మధ్య మూడు అడుగులు, మొక్కకు, మొక్కకు మధ్య నల్లరేగడి నేలల్లో అడుగు, ఇతర నేలల్లో అర్ధ అడుగులో విత్తుకోవాలి. విత్తిన 40 రోజులకు, ఆ తర్వాత 25 రోజులకు చమత్కార్ అనే మందు పిచికారీ చేస్తే అన్ని మొక్కలు సామానంగా పెరుగుతాయి. సమానంగా కాయలు వస్తాయి. రెండుసార్లు పత్తితీతతో పంట ముగుస్తుంది. మొక్కల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉండడం వల్ల దిగుబడులు పెరుగుతాయి. గులాబిరంగు పురుగు బెడద నుంచి బయట పడవచ్చు.



సాలురెడ్డి, ఏడీఏ, కర్నూలు

➡ పిబి నాట్ పద్ధతిని రైతులు సామూహికంగా చేపడితే గులాబిరంగు పురుగును తగ్గించుకోవచ్చు. గ్లాసిప్లూర్ అనే హార్మోన్‌తో తయారు చేసిన దారాన్ని ప్రతి ఐదు మొక్కలు కడుతూ పోవాలి. దీని నుంచి ఆడగులాబి రంగు పురుగు వాసన వస్తుండడం వల్ల మగ పురుగులు అక్కడే తిరుగుతుంటాయి. ఇలా తిరుగుతునే మరణిస్తాయి. ఇందువల్ల పురుగుల సంతతిని తగ్గించుకునే అవకాశం ఉంది. పిబి నాట్ పద్ధతిని గత ఏడాది గూడూరు మండలంలో అమలు చేశాం. మంచి ఫలితాలు వచ్చాయి.

➡ పత్తికి ప్రధానంగా రెండు రకాల వైరస్ తెగుళ్ల ప్రమాదం ఉంది. వీటిని నివారించుకోవడానికి పత్తి పంట చుట్టూ ఐదు వరుసలు బార్డర్ క్రాప్స్ వేయాలి. ఏపుగా పెరిగే జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి వాటిని సరిహద్దు పంటలుగా వేసుకుంటే రసం పీల్చే పురుగులు ఒక పొలం నుంచి మరో పొలానికి రాకుండా అడ్డుగోడలుగా ఉంటాయి. పత్తి సాగు చేసే రైతులు విధిగా సరిహద్దు పంటలను ఐదు వరుసలుగా వేసుకోవాలి. జూన్ చివరిలోపు పత్తి వేసుకుంటే గులాబిరంగు పురుగు వ్యాపించే సమయానికి రెండు కోతలుగా పత్తి తీయవచ్చు. అక్టోబరు నుంచి గులాబిరంగు పురుగు బెడద ఉంటుంది. జూన్ చివరిలోపు విత్తుకుంటే అక్టోబరు లోపు రెండు కోతలు అంటే ఎకరాకు 4 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు.

➡ పత్తిలో విధిగా అంతర పంటలు వేసుకోవడం అవసరం. అంతరపంటల వల్ల రైతుకు అదనపు ఆదాయం వస్తుంది. అంతరపంటలుగా పెసర లేదా మినుము, సోయాచిక్కుడు వంటి వాటిని వేసుకోవాలి. పత్తిలో పత్తి రెండు వరుసలకు ఈ పంటలు ఒక వరుస వేసుకుంటే పంటలకు మేలు చేసే కీటకాలు, పురుగులు వృద్ధి చెందుతాయి. అంతర పంటల వల్ల ఎకరాకు రూ.20 వేల వరకు అదనపు ఆదాయం ఉంటుంది. పంటలకు హాని చేసే పురుగులు తగ్గుతాయి.

కర్నూలులో టీడీపీ విజయం

- 18, 876 ఓట్లతో గెలిచిన టీజీ భరత్

కర్నూలు (టౌన్): కర్నూలు అసెంబ్లీ స్థానంలో టీడీపీ గెలిచింది. 2014, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే, ఈ సారి విజయం తెలుగుదేశం పార్టీకి వరించింది. మంగళవారం జరిగిన ఎన్నికల ఫలితాల్లో ఆపార్టీ అభ్యర్థి టీజీ భరత్ 18,876 ఓట్లతో విజయం సాధించారు. ఈ అసెంబ్లీకి సంబంధించి మొత్తం 19 రౌండ్లు ఉన్నాయి. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అభ్యర్థుల సమక్షంలో నిర్వహించిన ఓట్ల లెక్కింపు సాయంత్రం 4 గంటల వరకు సాగింది. మొత్తం రౌండ్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్ 10 వ రౌండ్‌లో 6,083 ఓట్లు, 11 వ రౌండ్‌లో 6,062 ఓట్లు, 18 వ రౌండ్‌లో 6,209 ఓట్లను ప్రత్యర్థి కన్నా ఎక్కువ సాధించాడు. మిగతా రౌండ్లలో తెలుగుదేశం అభ్యర్థి పై చేయి సాధించాడు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్‌కు మొత్తం 72, 814 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి భరత్‌కు 91,690 ఓట్లు వచ్చాయి.కాగా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయంతో ఆ పార్టీ జిల్లా కార్యాలయం, మౌర్య ఇన్‌లో టీజీవీ యూత్ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి ద్విచక్రవాహనాలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు.

పాణ్యంలోనూ హవా

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మె ల్యే అభ్యర్థి గౌరుచరితారెడ్డి 40,591 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డికి 1,00,681 ఓట్లు రాగా గౌరు చరితారెడ్డికి 1,41,272 ఓట్లు వచ్చాయి. కాగా ఈమె 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు.

ఆధ్యాత్మిక ఆనందం



ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన భారీ నంది విగ్రహం

దట్టమైన నల్లమలలో వెలిసిన మహానంది ఆలయ పరిసర అందాలు భక్తులకు మహానందం కలిగిస్తున్నాయి. పచ్చటి చెట్లు, ప్రకృతి అందాలు, పక్షుల కిలకిలరావాలు, కోనేటి జలసవ్వడులు భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. ఆలయానికి వచ్చిన వెంటనే రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన కృష్ణ శిలతో చేసిన నంది బసవన్న, ఆలయానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వివిధ రకాల వాయిద్యాలను చేతబూని మనసును ఉత్తేజపరిచే విచిత్ర గణపతులు, వివిధ రకాల ఆయుధాలను ధరించిన నవదుర్గలు భక్తులను ఆధ్యాత్మికానందానికి గురిచేస్తున్నాయి. ఆలయ రాజగోపురం దాటిన వెంటనే అటూ, ఇటూ రెండు కోనేరులు, పచ్చటి చెట్లు, పార్వతీ పరమేశ్వరులు. ఈ దృశ్యాలను చూసిన భక్తులు మంత్రముగ్ధులవ్వక తప్పదు. – మహానంది





ఆలయ మహాద్వారం దాటగానే కుడివైపున ఉన్న నవ వినాయకులు,ఎడమవైపున ఉన్న నవదుర్గలు



నీలకంఠుడికి నీలాకాశం నీడ

భద్రతా ఏర్పాట్ల తనిఖీ



డీఎఫ్‌ఎం ద్వారా లోపలికి వెళ్తున్న ఎస్పీ

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ భద్రతా ఏర్పాట్లను మంగళవారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆర్జీఎం, శాంతిరామ్, ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పట్లపై అక్కడి పోలీస్ అధికారులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు లోపలికి వెళ్లే సమయంలో పూర్తిగా తనిఖీ చేయాలని సూచించారు. గిరిజన గురుకులం, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో వాహనాల పార్కింగ్ కేటాయించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలకు పాల్పడే వారిని అరెస్ట్ చేసి తరలించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు.

వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరపున ఆర్‌ఓ నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వై.ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం: ఆధ్యాత్మికపురి మంత్రాలయం నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేసిన వై.బాలనాగిరెడ్డి అఖండ విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి టీడీపీకి చెందిన ఎన్.రాఘవేంద్ర రెడ్డిపై ఆయన 12,805 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మంగళవారం ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం ఎమ్మెల్యే తరపున వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్ రెడ్డి నియోజకవర్గ ఆర్‌ఓ చేతులమీదుగా గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఏజెంట్లు ఉన్నారు. తనను ఆదరించి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం పనిచేస్తానని, అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానని చెప్పారు.

ఉద్యానవనం.. నవ శోభితం

- శ్రీశైల క్షేత్ర సుందరీకరణకు ఏర్పాట్లు
- ఉద్యానవనాలలో పక్షి, జంతు బొమ్మలు
- ఆరుబయలు ప్రదేశాల్లో పచ్చిక బయళ్లు



క్షేత్ర పరిధిలో పూల తోటలు, పచ్చిక బయళ్లు

శ్రీశైలంటెంపుల్: ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య శ్రీశైల క్షేత్రం అలరారుతోంది. ఉద్యానవనాల నిర్వహణకు, పూలతోటల పెంపకం, పండ్ల తోటల ఏర్పాటుకు దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో భక్తులకు ప్రశాంత వాతావరణం నెలకొంది. భ్రామరీ పుష్పవనం వద్ద ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పండ్లతోట భక్తులను ఆకట్టుకుంటోంది.

ఆహ్లాదకరంగా ఉద్యానవనాలు

క్షేత్ర పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు దేవస్థానం 35 ఎకరాల విస్తీర్ణంలో 10 ఉద్యానవనాలను ఏర్పాటు చేసింది. ఇవి భక్తులు సేదతీరేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయి. వాటిలో ఏర్పాటు చేసిన జంతు, పక్షి బొమ్మలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రుద్రపార్క్, బసవవనాలతో పాటు పుష్కరిణి వద్ద వాటర్ ఫౌంటెన్, పాత పుష్కరిణి, ఇంజినీరింగ్ స్టోర్ వెనుకభాగంలోని పచ్చికబయళ్లు(ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్) తదితర చోట్ల ఏర్పాటు చేసిన నెమళ్లు, జింకలు, ఏనుగులు, పులులు, సింహాలు, జిరాఫీల బొమ్మలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సందర్శకులు, చిన్న పిల్లలు ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకుంటూ ఆనందిస్తున్నారు. క్షేత్ర సుందరీకరణలో భాగంగా ఇటీవల పాతపుష్కరిణి, ఇంజనీరింగ్ స్టోర్ వెనుకభాగం, ఆగమపాఠశాల సమీపంలోని దేవస్థానం కాటేజీల కూడలి, సిద్ధిరామప్పకొలను వద్ద పలు ప్రదేశాలలో పచ్చికబయళ్లు(ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్) ఏర్పాటు చేశారు. ఒకప్పుడు రాళ్లు, రప్పలు, పిచ్చిమొక్కలతో కూడిన ఈ ప్రదేశాలు నూతన శోభను సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన ఉగాది ఉత్సవాల్లో భక్తులు సేదతీరేందుకు ఈ పచ్చికబయళ్లు ఎంతగానో దోహదపడ్డాయి.









క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసి జంతు, పక్షి బొమ్మలు

నిత్యకైంకర్యానికి పూలు

ఉద్యానవనాలతో పాటు స్వామిఅమ్మవార్ల నిత్యకైంకర్యానికి అవసరమైన పూల కోసం పాతాళగంగ మార్గంలోని సర్వతోభద్రవనం, భ్రామరీ వనం, గులాబీ వనం, మల్లమ్మతోట తదితర చోట్ల పెంచుతున్న పూలతోటలు ఉపయోగపడుతున్నాయి. ఈ తోటలలో గులాబీ, మందారం, కనకాంబరం, గన్నేరు, నందివర్ధనం, గరుడవర్ధనం, మల్లెలు, కాగడాలు, లిల్లీలాంటి పూల జాతి మొక్కలు రోజుకు సుమారు 70 కేజీల పూల దిగుబడిని ఇస్తున్నాయి. వీటిని ప్రధాన ఆలయం, పరివార ఆలయాలలోని నిత్య కైంకర్యాలకు వినియోగిస్తున్నారు.

ఉద్యానవనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



శ్రీశైల దేవస్థానంలో ఉద్యానవనాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నాం. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పక్షి, జంతు బొమ్మలు ఏర్పాటు చేశాం. క్షేత్ర పరిధిలో పలు ఖాళీ ప్రదేశాల్లో ల్యాండ్ స్కేపింగ్ గార్డెనింగ్ పనులు జరుగుతున్నాయి. పండ్ల మొక్కల పెంపకాన్ని కూడా చేపట్టాం. క్షేత్ర పరిధిలో మరికొన్ని చోట్ల విశాలమైన ప్రదేశాల్లో ఉద్యానవన ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇవి భక్తులు సేద తీరేందుకు అనువుగా తీర్చిదిద్దనున్నాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి